క్లుప్తంగా

ముగిసిన శ్రీ గురు వైభవం ప్రవచన సప్తాహం


డాక్టర్ దీవీ హయాగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారి శాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ గురు వైభవం ప్రవచనం కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు మాట్లాడుతూ శ్రీ గురువైభవంలో నరసింహ సరస్వతిగా అందరినీ అనుగ్రహిస్తూ, వ్యవసాయదారుడైన పర్వతేషునికి శ్రీశైలం మహత్యం, గానుగాపురం విశిష్టత, పాదుక మహత్యం తదితర వాటి గురించి భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాశి వాసు, మహేష్, రామశేషు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రత్యక్ష దైవాలు


డాక్టర్ కిశోర్ కుమార్‌ను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): వైద్యులు ప్రత్యక్ష దైవాలు అని నంద్యాల రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేశవమూర్తి పేర్కొన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో 30 సంవత్సరాలు వైద్య సేవలు అందిస్తున్న సీనియర్ దంత వైద్యులు, ఐడీఏ రాయలసీమ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కిశోర్ కుమార్‌ను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, శేషఫణిశర్మ, మహబూబ్ బాషా, ప్రసాద్, కిరణ్ కుమార్ రెడ్డి, రవి కుమార్, గాంధీ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్ఐ

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన దస్తగిరి అనే మద్యం విక్రేతను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. గత కొంత కాలంగా ఆ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి వద్దే మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకొని దాడి చేయగా 16 మద్యం బాటిళ్లతో పట్టుబడినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

దొర్నిపాడు: ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు వర్తించాలంటే తప్పనిసరిగా గుర్తింపు కార్డు అవసరమని మండల వ్యవసాయాధికారి ప్రమిళ సూచించారు. బుధవారం గుండుపాపల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులు అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, పంట దిగుడబడులకు మద్దతు ధర వంటి పథకాలు పొందాలంటే కౌలు కార్డు ఉండాలన్నారు. కావున రైతులంతా ఆయా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ గురుగోవర్ధన్ తది తరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని చాబోలు గ్రామం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు అబ్దుల్‌సలాం, నాగేశ్వరమ్మ, విద్యాపతి, నాగమణి, విజయలక్ష్మిలకు స్థానిక పాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల స్థల దాత శివలింగం ముఖ్యఅతిథిగా హాజరైన సమావేశంలో హెచ్ఎం భాస్కర్, ఎంఈఓ శివరాంప్రసాద్, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొని సేవలను కొనియాడారు.

దొర్నిపాడులో భారీ వాన

దొర్నిపాడు: మండలంలో ఉన్నట్టుండి బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.దీంతో వాగులు వంకలు పొంగి పొర్లగా పలు కాలనీలు జలమయమయ్యాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న, మినుము పంటలకు వర్షం ప్రాణం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చాగలమర్రి నాయిబ్రాహ్మణ వీధిలోని మకానంలో కొలువు దీరిన పీర్లు, అశేషభక్తజనం మధ్య హూరేషహీద్ పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఊరూరా కొలువుదీరి

చాగలమర్రి/ఉయ్యాలవాడ: మొహర్రం పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు.త్యాగానికి ప్రతీకగా జరుపుకునే ఈ వేడుక గత నెల 26వ తేదీ నెలవంక దర్శనంతో ప్రారంభమైంది. ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పీర్లు కొలువు దీరాయి. భక్తులు వాటిని దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్నారు. మండలకేంద్రం చాగలమర్రిలో మొహర్రం వేడుకల్లో భాగంగా 6వ రోజు బుధవారం రాత్రి శ్రీహజ్రత్ హూరే షహీద్ పీర్ ఊరేగింపు నిర్వహించారు. అశేష భక్తజనం మధ్య ఈకార్యక్రమం సాగింది.పీర్లకు దారి పొడవునా భక్తులు ఫాతెహాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.


లాల్‌స్వామికి బాసికలు సమర్పిస్తున్న భక్తులు

- ఉయ్యాలవాడ మండలంలో పీర్ల పండుగ సందడి మొదలైంది. గ్రామాల్లోని చావిడిల్లో బుధవారం పీర్లు కొలువుదీరాయి. మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజున పీర్లను కుందూనదికి తీసుకు వెళ్లి నిమజ్జనం చేస్తారు.


ఆర్.పాంపల్లెలో చావిడిలో కొలువుదీరిన పీర్లు

శ్రీశైల జలాశయం ద్వారా సాగునీరు అందించాలి


వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఖరీఫ్ కింద రైతులు సాగు చేసిన మొక్కజొన్న, మినుము, పత్తి, తదితర పంటలు వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితుల్లో ఉన్నాయని, శ్రీశైలం జలాశయం ద్వారా నీరు అందించి రైతులను ఆదుకోవాలని భారత కిసాన్ మోర్చ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు తూముశివారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి కోరారు. శ్రీశైలం జలాశయంలో 854 అడుగులకు మించి నీరు ఉందని, తక్షణమే జిల్లా రైతులకు పలు రిజర్వాయర్ల ద్వారా నీరు అందించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 872 అడుగుల వరకు నీరు ఉందని, తక్షణమే పోతిరెడ్డిపాడు, గోరుకల్లు, వెలుగోడు రిజర్వాయర్, కుందూ, కేసీ కెనాల్, ఎస్సార్బీసీలకు నీరు అందించి పంటలు ఎండిపోకుండా చూడాలని కోరారు.

మెప్మా సీఓపై చర్యలు తీసుకోవాల్సిందే


ధర్నా నిర్వహిస్తున్న సీఆర్పీలు

నంద్యాల(న్యూటౌన్): సీఆర్పీ భవానీపై దాడి చేసిన మెప్మా సీఓ లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకునే వరకు విధులను బహిష్కరిస్తామని ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) నంద్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్, అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి హైమావతి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మెప్మా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఆర్పీ షేక్ రహమత్‌బీని సీఓ లక్ష్మీకుమారి రూ.30వేలు ఇవ్వకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరించిందన్నారు. ఈ విషయం 28వ వార్డులో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీ భవానీ బయటపెట్టడంతో ఆమెను అసభ్యకరంగా దూషిస్తూ దాడికి పాల్పడిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు స్పందించి సీఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెప్మా సంఘం నాయకురాళ్లు, సీఆర్పీలు ప్రసన్నకుమారి, సులోచన, సత్యావతి, సువర్ణ, మాధవి, జ్యోతి, అరుణ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


బి.నాగిరెడ్డిపల్లెలో రైతులకు సూచనలు ఇస్తున్న పశు వైద్యాధి కారి

రుద్రవరం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పాడి పశువులు, లేగ దూడలను ముందజాగ్రత్త చర్యలతో సంరక్షించుకోవాలని పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ సూచించారు.మండల పరిధిలోని బి.నాగిరెడ్డిపల్లె, కొండమాయపల్లె గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సుమతి బుధవారం పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడారు. బోరు బావుల కింద వరి నాడుమడులు సాగు చేసే రైతులు కేజీ విత్తనానికి సూడోమోనాస్ అనే మందును 8 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. అలా చేసుకోవడం ద్వారా నారుమడిలో తెగుళ్లు సోకకుండా నివారించుకోవచ్చని చెప్పారు. పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ మాట్లాడుతూ లేగదూడల సంరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని రైతులకు సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రూ.4,200 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను వేధిస్తున్నాయని చెప్పారు. సర్కారు తీరును నిరసిస్తూ ఫీజుల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 4వ తేదీ నుంచి 10 తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. స్పందించకపోతే 11వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, శశిధర్‌రెడ్డి, అస్లాం, ధనుష్, అఫ్రీజ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతతోనే అభివృద్ధి


మహిళలకు శిక్షణ ఇస్తున్న నాగేశ్వరరావు

నంద్యాల(అర్బన్): మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణలో బుధవారం ఆళ్లగడ్డ, రుద్రవరం, కొలిమిగుండ్ల, చాగలమర్రి తదితర మండలాల్లోని సర్పంచ్‌లకు మార్పు ద్వారా విజేతలు, సాధికారతతో సుపరిపాలనపై రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదగాలని చెప్పారు. ఎస్ఐఆర్‌డీ సంస్థ సభ్యులు నాగేశ్వరరావు సర్పంచ్‌లకు సాధికారతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, దస్తగిరిబాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు 'చలో పోతిరెడ్డిపాడు'

ఆత్మకూరు: సాగునీరు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 4న చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుతోట రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరిందన్నారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 875 అడుగుల నీరు చేరిందని, ఇంత నీరు చేరినప్పటికీ రాయలసీమ ప్రాంత రైతులకు సాగునీరు విడుదల చేయకపోవడం తగదన్నారు. గతంలో 850 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు కూడా సాగునీటిని విడుదల చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికే కర్నూలు, కడప జిల్లాల్లో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ముందస్తు వర్షాలకు ఆత్మకూరు డివిజన్‌లోని కొత్తపాడు, ఆత్మకూరు, వెలుగోడుతోపాటు బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేసుకున్న మొక్కజొన్న, పత్తి, కంది పైర్లు వాడిపోతున్నాయన్నారు. తెలుగుగంగ, తుంగభద్ర ప్రాజెక్టులతోపాటు పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మాబాషా, వీరన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

4,5 తేదీల్లో ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నా

నంద్యాల(వ్యవసాయం): ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు కొండారెడ్డి, కార్యదర్శి డీకే మూర్తులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు.

ఆలయ భూములకు నేడు బహిరంగ కౌలు వేలం

బండిఆత్మకూరు: మండలంలోని సంతజూటూరు గ్రామంలోని పలు ఆలయ భూములకు బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి ఈ నాగ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 43 ఎకరాలకు, ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 4 ఎకరాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని, వేలంపాటలో పాల్గొనే వారు రూ.1000 చెల్లించాలన్నారు.

యాగంటి వేలాలు వాయిదా

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో రుద్రాక్ష మాలలు, రక్షాధారణలు, కరుంగలి మాలలు, రాగికడియాలు విక్రయించుకునేందుకు బుధవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలాలను వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు. అనివార్య కారణాలతో వాయిదా పడ్డాయని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

24వ వార్డులో పర్యటించిన మంత్రి

నంద్యాల(అర్బన్): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 24వ వార్డులో న్యాయ శాఖ మంత్రి ఫరూక్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు, నాయకులు స్వామినాయక్, సుబ్బరాయుడు, శ్రీదేవి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

బనగానపల్లె : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన కొమ్ముశేఖర్, కొమ్ము మహేష్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు.ఎస్ఐ వివరాల మేరకు కొమ్ము శేఖర్ తాగుడుకు బానిసై తన భార్య రమాదేవిపై అనుమానంతో మానసికంగా వేదింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయంలో భార్య భర్తలు గత రెండు రోజుల క్రితం గొడవపడుతుండగా రమాదేవి తల్లి నారాయణమ్మ అడ్డు వచ్చింది. దీంతో కొమ్ము శేఖర్, కొమ్ము మహేష్.. నారాయణమ్మను కొట్టి చంపుతానని బెదిరించారు. నారాయణమ్మ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అవుకు: మండలంలోని రామాపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రాజారెడ్డి బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి బాలయ్య (51) బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా తాడిపత్రి నుంచి వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయమై మృతి చెందాడు. భార్య చాకలి హుసేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అదనపు భూ సేకరణకు క్లెయిమ్స్ స్వీకరణ

పాములపాడు: నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనులకు సంబంధించి అదనపు భూ సేకరణ నిమిత్తం రైతుల నుంచి క్లెయిమ్స్‌ను ఆర్డీఓ నాగజ్యోతి స్వీకరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మాట్లాడుతూ జూటూరు గ్రామం వద్ద జరుగున్న హైవే పనులకు 3.805 ఎకరాలు అవసరముందన్నారు. భూమి యజమానులు 38 మందికి అవార్డు కాపీలను అందించామన్నారు. వీరంతా భూముల ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, పొలం పాసుబుక్కులతోపాటు 11 రకాల పత్రాలను అందించాలన్నారు. రైతుల నుంచి క్లెయిమ్స్ పత్రాలు స్వీకరించినట్లు వివరించారు. అలాగే జూపాడుబంగ్లా మండలంలో 1.07 ఎకరాల భూమి సేకరిస్తున్నామన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం



ఇంజేడు గ్రామంలో రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి

నంద్యాల(అర్బన్): పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగ, పిల్లిపెసర, మినుము సాగుతో నేల సారవంతమవుతుందని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పోలూరు, ఊడుమాల్పురం గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం పెరిగిందని, అయితే, ఈ పంటలో కత్తెర పురుగు ఆశిస్తుందని, నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎకరాకు ఆరు లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో పాటు అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొదటి దశలో లీటరు నీటికి 5మి.లీ వేప నూనె పిచికారీ చేయాలని, పురుగు ఉద్ధృతి అధికంగా ఉంటే ఏమోమేటిక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవల్లిక, ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, వీఏఏలు తేజశ్విని, సంజీవ, రైతులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో కత్తెర పురుగుకు చెక్

ఉయ్యాలవాడ : లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో మొక్క జొన్న పంటను ఆశించే కత్తెర పురుగులకు చెక్ పెట్టవచ్చునని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఇంజేడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో ఇప్పటికే 16 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారన్నారు. కత్తెర పురుగు ఆశించిన మొదటి దశలోనే లీటర్ నీటికి 5 ఎంఎల్ వేప నూనె పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి పెట్టుబడి ఖర్చు పెరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పాల్గొన్నారు.

పల్లాకు తెగుళ్ల నివారణపై అవగాహన

చాగలమర్రి: మినుము పంటలో పల్లాకు తెగుళ్ల నివారణలకు కలుపు నివారణ చర్యలు చేపట్టాలని డీఆర్‌సీ ఏఓ హేమసుందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన చాగలమర్రి, మద్దూరు గ్రామాల్లో ఏఓ రంగనేతాజి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హేమంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కజొన్న, మినుము పంటలలో సమగ్ర కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు


పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయం భూమికి ఎంతో మేలు చేస్తుందని, అలాగే రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ స్టేట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నెహ్రూ నగర్, జిల్లెళ్ల గ్రామాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో ఆధారతి వ్యవసాయం భూమిని సారవంతం చేస్తుందన్నారు. ఈ వ్యవసాయ పద్ధతిలో పంటల సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. పచ్చి రొట్టె ఎరువులు పరిశీలించి భూమి ఆరోగ్యానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులకు కావలసిన ఎరువులు, కషాయాలు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మయ్య, జిల్లా అడిషనల్ ప్రోగ్రాం మేనేజర్ టి.అబ్దుల్ సలాం, స్టేట్ అడ్వైజర్ బోర్డ్ మెంబర్ ఆచారి, బాల మద్దిలేటి, రైతులు పాల్గొన్నారు

కార్మికుల సత్తా చాటుదాం

- ఈనెల 9న చేపట్టిన సమ్మెను విజయవంతం చేద్దాం
- జిల్లా కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకుల పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

నంద్యాల(న్యూటౌన్): దేశవ్యాప్తంగా ఈనెల 9వ తేదీన జరిగే సమ్మెను విజయవంతం చేసి కార్మికుల సత్తాచాటుదామని జిల్లా కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయా సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 10 గంటల పని విధానం, రాత్రి సమయంలో మహిళలు పని చేసే విధానం అమలు చేయరాదన్నారు. దీనిని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. అలాగే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, వారు చేసిన రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 వేతనం ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ కార్మిక ప్రజా సంఘాల నాయకులు గౌస్, రామచంద్రుడు, బాలవెంకట్, వెంకటలింగం, లక్ష్మణ్, సురేష్, శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వంటావార్పుతో నిరసన


దీక్షస్థలంలో వంటకు సిద్ధం చేసుకుంటున్న కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. కూర్చున్న చోటే వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు బాలదుర్గన్న, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, భాస్కరాచారి మాట్లాడుతూ జీఓ నం.36 ప్రకారం రూ.21 వేల నుంచి రూ.24,500 పెంచాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, చనిపోయిన కార్మికుడి కుటుంబంలో ఉద్యోగాలు ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద మరణానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా నుంచి రూ.7 లక్షలు పెంచాలని, దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. వీటిపై కూటమి ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

కేసీకి నీరు విడుదల చేయాలని వినతి


జేసీకి వినతి పత్రం అందజేస్తున్న రైతు నాయకులు

నంద్యాల(అర్బన్): శ్రీశైలం రిజర్వాయర్ నిండటంతో పోతిరెడ్డిపాడు నుంచి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి సీమ రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి కోరారు. వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయని, తక్షణమే స్పందించి శ్రీశైలం నుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని బుధవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు కొద్ది సేపు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అయ్యప్ప, వెంకటరాముడు, సూరిబాబు, కార్యదర్శి ప్రసాదరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రుద్రవరంలో వర్షం కురుస్తున్న దృశ్యం

వర్షం..హర్షం

రుద్రవరం: మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మంగళవారం వరకు వానలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందేవారు. ముందస్తు వర్షాలకు సాగు చేసిన పంటలు పత్తి, మొక్కజొన్న, మినుము తదితరవి వాడు ముఖం పట్టాయి. బుధవారం కురిసిన వాన ఆ పైర్లకు ఊపిరి పోసినట్లు అయ్యిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.